# మబ్బు విడిచిన వెన్నెల

మళ్లీ వచ్చాడు. వస్తాడని అనుకోలేదు. ఎందుకు వచ్చాడో తెలీదు. కానీ వచ్చి ముందుగదిలో కూర్చుని దిక్కులు చూస్తున్నాడు. మొహంలో ఏ భావమూ లేదు.

ముందుగా అతనే పలకరించాడు "బాగానే వున్నావు"

నేను జవాబుగా చెప్పలేదు. కనీసం పలకరింపుగా నవ్వనుకూడా లేదు.

అతడిని చూడగానే గతమంతా ఒక్కసారి గుర్తుకువచ్చింది. కంట్రోలు చేసుకోవడం కొంచెం కష్టమయ్యింది.

మంచివాడే కాకపోతే మొండితనం ఎక్కువ.

అంతకుముందే ఆఫీసునుంచి వచ్చి బట్టలు మార్చుకుని కాఫీ కలుపుతున్నప్పుడు, ముంగిలా వచ్చి లోపల కూర్చున్నాడు.

ఇంతకుముందు కంటే బాగున్నాడు. ఫిజిక్ గురించి జాగ్రత్త పడుతున్నవాడిలా కనిపించాడు. కొత్త బట్టలేమో, మెరుపు తగ్గలేదు.

గదిలో లైటు వెలుగుతోంది. చలికాలం కావటంతో గదంతా చల్లగా వుంది.

కాఫీ అంటే ఇష్టం అతడికి. ఎన్నిసార్లు ఇచ్చినా తాగుతాడు.

వంటగదిలో నించి ఫిల్టర్ కాఫీ వాసన గదంతా వ్యాపించింది.

"నేను కాఫీ ఇస్తానని అనుకుని వుంటాడు. ఇవ్వకపోతే బాధపడతాడా? ఏమో! బాధపడొచ్చు. ఐనా ఒక కప్పు కాఫీతో పోయేదేముంది?" అలా అనుకుని నిరంజనానిక్కూడా కాఫీ ఇచ్చాను.

ఆత్రంగా అందుకుని థ్యాంక్స్ చెప్పాడు. అతడి మొహం వికసించింది. వచ్చిన దగ్గిర్నించీ కాఫీకోసమే ఎదురుచూస్తున్నట్టున్నాడు.

గబగబా తాగాడు. నేను లోపల నిల్చుని తాగాను.

"చాలా రోజులయ్యింది మంచి కాఫీ తాగి, నువ్విచ్చిన కాఫీ బావింది" పొడిగా అన్నాడు.

నేను మాట్లాడలేదు. నా మౌనాన్ని భరించడం అతడికి కష్టఀగా వుండి ఉంటుంది.

"నీకోసమే వచ్చాను" అన్నాడు ముక్తసరిగా.

"ఇంకా ఏం మిగిలిందని?" ముందుగదిలోకి వచ్చి అన్నాను.

"చాలానే మిగిలింది" ఏమాత్రం ఆలస్యం లేకుండా. జవాబును సిద్ధం చేసుకున్నవాడిలా అన్నాడు.

"ఏమిటి?" కొంచెం కుతూహలంగానే అడిగాను.

"నీమీద ప్రేమ" ఠక్కున అనేశాడు.

"ఇంకానా?" హేళనగా అడిగాను.

"అవును అంజలీ! మొదట్లో నాకూ తెలీదు. మనం విడిపోయినప్పుడు కొంచెం వెలితిగా అనిపించింది. ఇద్దరు మనుషులు కలిసి ఫోటో తీయించుకున్నప్పుడు, అందులో ఒక మనిషి ఫోటోను చెరిపితే ఏర్పడిన ఖాళీవంటిది అది. సరిపెట్టుకున్నాను. కానీ నీ మాటలు, నీ నవ్వు, నువ్వు నామీద చూపిన ప్రేమ, నాతో కలిసినప్పుడు నీ మొహంలో కదిలే సంతోషం తాలూకు జ్ఞాపకాలు నన్నింకా వెంటాడుతూనే వున్నాయి. నిమిషాలూ గంటలూ రోజులూ గడుస్తున్నకొద్దీ అంత గాఢంగానూ నిన్ను నేను ప్రేమించాననీ అభిమానించాననీ తెలిసొచ్చింది. నీకో విషయం తెలీదు అంజలీ! మనుషుల మధ్య దూరం పెరుగుతుంది గానీ, మనసుల మధ్య దూరం పెరగదు. మనుషులు దూరమయ్యాం కాబట్టి మనసుల దూరం కూడా పెరిగినట్టు అనుకుంటాం. తరచి చూస్తేకానీ తెలీదు. జ్ఞాపకాలు మనుషుల్ని ఎప్పుడూ దగ్గరజేస్తూ ఉంటాయి" అని ఊరుకున్నాడు.

నిరంజనం మాటలు విన్నాక, అతడికి ఇంకోసారి కాఫీ కలిపి ఇవ్వాలనిపించింది. కష్టపడ్డాడని కాదు, అతడికి నామీద వున్న ప్రేమ పూర్తిగా చావలేదని తెలియజేసినందుకు.

ప్రేమకు పపవశించడమన్నది అంతటా ఉంది.

ఆశ్చర్యమేమిటంటే, కాఫీ తాగాక నిరంజనం సిగరెట్ కాలుస్తాడు. అతడు చైన్‌స్మోకర్. అయినా, ఇంతవరకూ అతను జేబులోనించి సిగరెట్ పెట్టెను బయటకు తియ్యలేదు.

మరచిపోయి ఉండడు. గుర్తుపెట్టుకుని అవస్థపడుతున్నాడనుకుంటాను.

నవ్వొచ్చింది. హెడ్మాష్టరు ముందు పాఠం అప్పగించి స్కూలు కుర్రాడు గుర్తుకొచ్చాడు.

నిరంజనం నావైపు భయంభయంగా చూస్తున్నాడు.

సిగరెట్టు కాల్చాలని ఉంది. కానీ నా ఎదురుగా కాల్చలేడు. బలవంతంగా నిగ్రహించుకుంటున్నాడు. కానీ ఎంతసేపు ఇలా?

సిగరెట్ కాలిస్తే ఊరుకోను. నిర్దాక్షిణ్యంగా బయటకు పంపుతానని భయం.

ఆ పొగ నాకు పడదు. ఆ వాసన కూడా గిట్టదు. కళ్లు మండుతాయి. వికారం పుడుతుంది. తలనొప్పి వస్తుంది. నిరంజనానికి అర్ధరాత్రి కూడా లేచి కూర్చుని సిగరెట్లు తాగే అలవాటుంది. ఫ్యాను గాలికి పొగ చుట్టుకుపోయేది. కళ్లు మండి, ఇక నిద్ర ఉండేది కాదు.

సిగరెట్లు కాల్చవద్దని చెబితే వినేవాడు కాదు. అతడి చేతివేళ్ల మధ్య ఎప్పుడూ కాలుతున్న సిగరెట్టు దర్శనమిచ్చేది.

పల్లెటూరిలో పెరిగాడేమో చిన్నతనంలో బోలెడంతా స్వేచ్ఛ అతడికి చిన్నపుడే తండ్రి పోయాడట. తల్లి గారాబ పెంపకంతో సిగరెట్లకు అలవాటుపడినట్లున్నాడు.

పెద్దవాడైనా ఆ అలవాటును చావనివ్వకుండా, అతనంత బలంగా తయారుచేశాడు.

ఎన్నోసార్లు ప్రాధేయపడ్డాను. వినలేదు. ఇంక అతడు మారడని తెలిసి, చివరికి అతడినే వదులుకున్నాను.

ఆలోచిస్తే ఎవరికయినా ఇది సిల్లీగానే కనపడొచ్చు కానీ నా ప్రాబ్లమ్ నాది. భరించలేకపోయాను.

కొన్ని రకాల సంఘటనల సాంద్రత అందరికీ ఒకే విధంగా ఉండదు. అతడిని వదులుకున్న ఆర్నెల్ల తర్వాత, ఇప్పుడు మళ్లీ వచ్చాడు.

"ఇంకా చెప్పేది ఏమయినా మిగిలివుందా?" పరిహాసంగానే అడిగాను. నా మాటలతో అతడిని బాధించాలని ఏ మూలనో ఉన్నట్టుంది. అందుకే అలా వస్తున్నాయి నా మాటలు.

"నా మాటల్లో నీకు సిన్సియారిటీ కనిపించటంలేదా అంజలీ?" దెబ్బతిన్నవాడిలా అడిగాడు తలెత్తి.

నేనలా అనకుండా ఉంటే బావుండేదనిపించింది. మరీ ఇంత నిర్దయ నాకు పనికిరాదేమో? ఎంతయినా అతడు నా ప్రేమికుడు. నా జీవిత బాగస్వామిగా కోరుకున్న వ్యక్తి!

బాధపెట్టాను. శరీరాన్ని బాధించవచ్చు కానీ మనసు జోలికి వెళ్లకూడదు. విలవిలలాడుతుంది.

నిరంజనాన్ని బాధపెట్టినందుకు పరిహార్‌గా లోపలకు వెళ్లి అప్పటికప్పుడు కాఫీ కలిపాను.

కాఫీ వాసన తగిలిందేమో? కుర్చీలో సర్దుకుని నిటారుగా కూర్చున్నాడు.

థాంక్స్ చెప్పాడు కప్పును అందుకుని. అతడి మొహంలోని సంతోషాన్ని చూస్తే, ఐస్‌క్రీం కప్పును అందుకుంటున్న చిన్నకుర్రాడిలా అనిపించాడు.

"ఇంకా నువ్వు నన్ను ద్వేషిస్తున్నావా?" కాఫీ తాగుతూనే అడిగాడు.

నా నోటివెంట జవాబు తరుముకుని వచ్చింది "నిన్నెప్పుడూ ద్వేషించలేదు. నువ్వు చూసుకోలేని నీ అలవాటును, ఇష్టపడి ప్రేమించిన ఓ ఆడదానికోసం చిన్నపాటి త్యాగమైనా చెయ్యలేని నీ మొండితనాన్ని ద్వేషించాను. కానీ నా దృష్టిలో నువ్వెప్పుడూ మంచివాడివే".

"ధన్యుడిని" అన్నాడు ఖాళీ చేసిన కప్పును కింద పెట్టి.

"ఇంతకీ ఇప్పుడెందుకొచ్చినట్టూ?" అడిగాను.

"నీకో నిజం చెప్పాలని వచ్చాను అంజలీ! నిజానికి ఈ ఆర్నెల్లూ నరకాన్ని చూసి ఇప్పటికి బయటపడ్డాను"

"నరకం ఏమిటి? నిజం ఏమిటి?" ఉత్కంఠగా అడిగాను.

"సిగరెట్లు కాల్చడం మానేశాను. ఆర్నెల్లు పట్టింది. కావాలంటే నా బట్టలు వెతుక్కో సిగరెట్టుపెట్టె లైటరూ కనబడితే నీళ్లు కాచి ఆ వేడినీళ్లు నా మొహాన పొయ్యి" అన్నాడు సీరియస్‌గా.

ఈసారి పైకే నవ్వాను.

"నువ్వు నమ్ముతావా అంజలీ! నీకోసం ఏదయినా వదులుకుంటాను. గానీ నిన్ను మాత్రం వదులుకోను" ఆవేశంగా అన్నాడు.

"బాగా మాట్లాడుతున్నావు నిరంజనం" నవ్వకుండా మెచ్చుకున్నాను.

"అవసరమనేది ఎవరిచేతనైనా బాగా మాట్లాడిస్తుందనుకుంటాను" అన్నాడు ఈసారి తను నవ్వి.

"ఏదేమైనా కంగ్రాచ్యులేషన్స్" చేతిని ముందుకు చాపుతూ అన్నాను.

"ఎందుకో తెలుసుకోవచ్చా?"

"నాకోసం నీ చిన్ననాటి అలవాటు మానుకున్నందుకు"

"ఇంతేనా?" అన్నాడు తేలిగ్గా.

"అందుకే ఆర్నెల్లు పట్టిందికదూ?" అన్నాను నవ్వి.

"ఇక నేను వెళతాను" అన్నాడు లేవబోతూ.

"కూర్చో భోజనంచేసి వెళుదువుగాని ఇద్దరికీ వంట చేస్తాను" అన్నాను లేచి.

నిరంజనం ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నవాడిలా తిరిగి కుర్చీలో కూర్చున్నాడు.

"నీకు చెప్పటం మరచిపోయాను నిరంజనం. సాయంత్రం బస్సులో వస్తున్నప్పుడు నా పక్కసీటుమీద ఒక సిగరెట్టుపెట్టె దొరికింది. నువ్వు కాల్చే బ్రాండే. తీసి హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకొచ్చాను. ఇందులో రెండు సిగరెట్లున్నాయి. కాలుస్తావా?" అనడిగాను.

"పరీక్ష పెడుతున్నావా అంజలీ?"

"లేదు నిరంజనం. నాకు దూరంగా ఎక్కడయినా నువ్వు సిగరెట్లు కాలిస్తే నాకు అభ్యంతరం లేదు. ఇప్పుడైనా నువ్వు బయటకు వెళ్లి కాల్చుకోవచ్చు. నీమీద అధికారం చెలాయించడం నా కిష్టంలేదు. ఎందుకంటే నువ్వు నాక్కాబోయే భర్తవి" అన్నాను.

ఏం మాట్లాడాలో తెలీక, నిరంజనం మాటలు వెతుక్కున్నాడు. ❖

*విపుల మాసపత్రిక, అక్టోబర్ 2011*